క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్ తనిఖీ



కోటనందూరు పోలీసుస్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

కోటనందూరు: స్థానిక పోలీసు స్టేషన్‌ను పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు పరిశీలించిన ఆయన పలు కేసులపై ఆరా తీశారు. ఎఫ్ఐఆర్ వేసిన కేసులకు సత్వర పరిష్కారం చూపించాలని ఎస్సై రామకృష్ణను ఆదేశించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. తుని రూరల్ సీఐ జి.చెన్నకేశవరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెరపిస్టు టీఎన్ఎస్ సోమేశ్వరరావు చిన్నారుల అవసరాలకు అనుగుణంగా పలు వ్యాయామాలు చేయించారు. పిల్లల ఆరోగ్యం పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. రోజూ ఇంటి వద్ద ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ శ్రీనివాస్ పరిశీలించారు.

పిల్లల భద్రతపై అవగాహన ర్యాలీ

జగ్గంపేట: పిల్లల భద్రత, సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ తెలిపారు. చైల్డ్ సేఫ్టీ ఓరియంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా జగ్గంపేటలో బుధవారం ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ, జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ ర్యాలీ సాగింది. మెయిన్ సెంటర్‌లో బాలికల సంరక్షణపై అవగాహన కల్పించారు. తొలుత స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పడాల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండల రిసోర్స్‌పర్సన్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి చైల్డ్ సేఫ్టీ ఓరియెంటేషన్ ప్రోగ్రాంపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌డీఏ, డ్వామా, ఐసీడీఎస్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

జీడిపిక్కల ఫ్యాక్టరీని తెరిపించాలంటూ ర్యాలీ

ఏలేశ్వరం: మండలంలోని చిన్నింపేటలో జీడిపిక్కల ఫ్యాక్టరీ వెంటనే తెరిపించాలని కోరుతూ పట్టణంలో బుధవారం కార్మికులు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ చేసి స్థానిక బాలాజీచౌక్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి యాజమాన్యం అర్ధంతరంగా ఫ్యాక్టరీని మూసి వేసిందన్నారు. యాజమాన్యం నిర్ణయంతో గత పదేళ్లుగా పనిచేస్తున్న కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. కొత్త కంపెనీలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెబుతోందని, ముందు ఈ ఫ్యాక్టరీ మూతపడకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అనిసెట్టి వీరబాబు, చక్రధర్, చంటి, జయలక్ష్మీ, శివాలక్ష్మి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: మండలంలోని కె.మిర్తివాడ గిరిజన తండాలో సారా స్థావరాలపై బుధవారం ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1,200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

పెరుమాళ్లపురంలో...

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పరిసర ప్రాంతాల్లో సారా స్థావరాలపై బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన తొమ్మిది వేల లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తుని ఎక్సైజ్ సీఐ పట్టాభి చౌదరి తెలిపారు. పెరుమాళ్లపురం పంచాయతీ అవులమంద, బుచ్చియ్యపేట, గడ్డిపేట తదితర ప్రాంతాల్లో సారా బట్టీలను ధ్వంసం చేయడంతో పాటు 30 లీటర్ల సారాతో వ్యక్తిని అరెస్టు చేసినట్టు చెప్పారు.

రౌతులపూడి: మండలంలోని పైడిపాలలో సారాబట్టీలపై స్థానిక ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. సారా తయారీకి పాల్పడుతున్న పైడిపాల గ్రామానికి చెందిన చింతా బాలు అదుపులోకి తీసుకున్నారు. సంఘటన స్థలం నుంచి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పెండింగ్ బిల్లుల రికవరీకి చర్యలు

కిర్లంపూడి: మండలంలోని విద్యుత్ పెండింగ్ బిల్లులు రికవరీపై ట్రాన్స్ కో అధికారులు చర్యలు తీసుకున్నారు. కిర్లంపూడిలో విద్యుత్ బిల్లులు కట్టని వారి ఇళ్లకు బుధవారం అధికారులు వెళ్లి సర్వీసులను తొలగించారు. దీనిపై వినియోగదారులు మాట్లాడుతూ ఒక్కసారిగా రూ.40 నుంచి రూ.50 వేలు కట్టమంటే ఎలా కట్టాలని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎల్ఐ రాజును వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లాంగ్‌టర్మ్ బకాయిలు పడిన సర్వీసులను తొలగిస్తున్నట్టు తెలిపారు. వచ్చిన బిల్లులో కనీసం సగం బిల్లు కట్టిన వారి సర్వీసులను తొలగించడం లేదని చెప్పారు.

జలము నిశ్చయంబు

- పట్టణ ప్రజలకు పుష్కలంగా రక్షిత తాగునీటి సరఫరా
- ఏటా పన్ను ఆదాయం రూ.90 లక్షలు
- అమృత్-2 పథకంలో రూ.9.50 కోట్లతో ప్రతిపాదనలు
- మెగా రిజర్వాయర్లు, పంపు హౌస్ నిర్మాణానికి కసరత్తు



తుని పట్టణ ప్రజలకు నీటిని అందిస్తున్న ప్రధాన పంపుహౌస్

తుని: పురపాలక సంఘంలో ప్రజలకు తాగునీటి కష్టాలు లేకుండా అధికారులు చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. ప్రస్తుత జనాభాకు అనుగుణంగా రోజుకు 7.15 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ ఫర్ డే) అవసరం కాగా ప్రస్తుతం రోజుకు 6.15 ఎంఎల్‌డీ నీటిని అందిస్తున్నారు. సగటున మనిషికి రోజుకు 135 లీటర్లకు గాను 115 లీటర్లు సరఫరా చేస్తున్నారు. నూరుశాతం నీటిని అందించడానికి కేవలం ఒక ఎంఎల్‌డీ నీటిని అందుబాటులోకి తీసకువస్తే చాలు. అలాచేస్తే నీటి కొరత కనిపించదు. దీనిలో భాగంగా ప్రభుత్వానికి అమృత్-2 పథకానికి రూ.9.50 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఆరు నెలల్లో అనుమతులు వస్తాయని, వాటితో రెండు మెగా రిజర్వాయర్లు, పంపు హౌస్, అదనపు పైపులైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఇది నాలుగేళ్ల పాటు దశల వారీగా చేస్తామని డీఈఈ ప్రకాశరావు తెలిపారు.

30 వార్డులు, 14 వేల కుటుంబాలు

తుని పట్టణం 7.02 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. 54,925 మంది జనాభా ఉన్నారు. 30 వార్డుల పరిధిలో 14 వేల కుటుంబాలు ఉన్నాయి. వీరందరికీ ప్రస్తుతం 6.15 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నారు. సగటున మనిషికి రోజుకు 135 లీటర్లు నీరు అవసరం కాగా 115 లీటర్లు అందిస్తున్నారు. డ్రైవర్స్‌కాలనీ, బాడవతోట ప్రాంతాలకు మాత్రం వేసవిలో నీటి ఇబ్బందులు ఉన్నాయి. దీనిని అధిగమించేందుకు సమ్మర్ ప్లాన్‌లో రూ.3 లక్షలు నిధులు కేటాయించారు. రేఖవానిపాలెం, కర్రాల్లకొండ, రాజీవ్‌గృహకల్ప, మార్కెట్, నుకాలమ్మ గుడి, నామగిరి వీధి, రామకృష్ణాకాలనీ, తదితర ప్రాంతాల్లో పంపుహౌస్‌లు ఉన్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక, బాడవతోట, మార్కండ్రాజుపేట తదితర ప్రాంతాల్లో 6.15 ఎంఎల్‌డీ నీటిని నిల్వ చేసే రిజర్వాయర్లు ఉన్నాయి. ప్రతి పంపు హౌస్ దగ్గర క్లోరినేషన్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నారు.

ఆదాయం, వ్యయం సమానం

మున్సిపాలిటీకి నీటి పన్ను ద్వారా ఏటా రూ.90 లక్షలు ఆదాయం వస్తుంది. విద్యుత్ బిల్లులు, నిర్వహణకు రూ.90 లక్షలు అవుతుంది. ఇది కేవలం డొమిస్టిక్ విభాగంలో వస్తున్న ఆదాయం. కమర్షియల్ కేటగిరిలో ఉన్న హోటల్స్, ఫంక్షన్ హోల్స్, ఆసుపత్రులు, తదితర వాటి నుంచి వస్తున్న ఆదాయం నామమాత్రమే. వీటికి మీటర్లు ఏర్పాటు చేస్తే వినియోగం ఆధారంగా అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు కసరత్తు చేయాలని ప్రజలు సూచిస్తున్నారు.

తుని మున్సిపాలిటీలో ప్రజలు, తాగునీటి సరఫరా పూర్తి వివరాలు

పురపాలక సంఘం గ్రేడ్ -2

విస్తీర్ణం :	7.02 చదరపు కిలోమీటర్లు
జనాభా:	54,925
కుటుంబాలు :	14,000
పైపులైన్ పొడవు :	74.33 కిలోమీటర్లు
పంపింగ్ మెయిన్ లైన్ :	1.80 కిలోమీటర్లు
నీటి నిల్వ చేసే రిజర్వాయిర్లు :	11
పవర్ బోర్లు :	09
చేతి పంపులు :	214
ఇంటి కుళాయిలు :	5,549
వీధి కుళాయిలు :	317
నీరు డిమాండ్ :	7.15 ఎంఎల్‌డీ
ప్రస్తుతం సరఫరా :	6.15 ఎంఎల్‌డి
మనిషికి రోజుకు సరఫరా చేయాల్సింది:	135 లీటర్లు
ప్రస్తుత సరఫరా చేస్తుంది:	115 లీటర్లు
నీటి పన్ను ఆదాయం :	90 లక్షలు (ఏడాదికి)
నిర్వహణ వ్యయం :	90 లక్షలు(ఏడాదికి)

అమృత్-2 పథకం ప్రతిపాదనలు
నాలుగేళ్లలో రూ.9.30 కోట్ల వ్యయం

నిర్మాణాలు :	రెండు రిజర్వాయర్లు, పంపుహౌస్, పైపులైన్ల విస్తరణ

అమృత్-2 పథకంతో పరిష్కారం

పట్టణంలో నీటి సమస్య లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్-2 పథకం ఉపయోగపడుతుంది. నాలుగేళ్ల పాటు పథకం పనులు కొనసాగుతాయి. రూ.9.50 కోట్లు నిధులు రానున్నాయి. వీటితో రెండు మెగా రిజర్వాయిర్లు, పంపు హౌస్, అదనపు పైపు లైన్ల నిర్మాణం చేపడతాం. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాం. ఆరు నెలల్లో అనుమతులు రానున్నాయి. దీంతో కొరత ఉన్న ఒక ఎంఎల్‌డీ నీరు అందుబాటులోకి వస్తుంది.

–ప్రకాశరావు, డీఈఈ, తుని

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు



పట్టణ ప్రజలకు వేసవిలో సైతం ఉదయం, సాయంత్రం తాగు నీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నాం. అందుబాటులో ఉన్న అన్ని వనరులను ఉపయోగించుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. నీటి సరఫరాకు సంబంధించి నిధుల కొరత లేకుండా కేటాయింపులు చేస్తున్నాం. రెండు వార్డుల్లో నీటి సమస్య ఉందని కౌన్సిలర్లు తమ దృష్టికి తీసుకువచ్చారు. ట్యాంకుర్లు ఏర్పాటు చేసి నీటిని అందించాలని రూ.3 లక్షలు మంజూరు చేశాం.

–ఏలూరి సుధారాణి, మున్సిపల్ చైర్‌పర్సన్, తుని

ముద్రగడ నాయకత్వంలోనే అభివృద్ధి



కిర్లంపూడిలో ముద్రగడను, గిరిబాబును కలిసిన ప్రజాప్రతినిధులు, నాయకులు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం నాయకత్వంలోనే ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని ఏలేశ్వరం నగర పంచాయతీ మూడో వార్డు కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందుబాబు అన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఏలేశ్వరం మండలానికి చెందిన పలువురు సర్పంచులు, కౌన్సలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి తరలివచ్చి ఆయనతో పాటు, యువ నాయకుడు గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఏలేశ్వరం గ్రామస్తులతో తనకున్న అనుబంధాన్ని ముద్రగడ గుర్తు చేసుకున్నారు. ముద్రగడను కలిసిన వారిలో యర్రవరం సర్పంచ్ భీశెట్టి అప్పలరాజు, మాజీ సర్పంచ్‌లు, మాజీ కౌన్సలర్లు, మాజీ సొసైటీ డైరెక్టర్లు, దళిత సంఘాల నాయకులు, సోషల్ మీడియా కన్వీనర్లు తదితరులు ఉన్నారు.

ఘనంగా కార్తిక వనసమారాధన

కిర్లంపూడి: స్థానిక కాపుల రామాలయం వద్ద బుధవారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం, యువ నాయకుడు గిరిబాబు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

నేడు విధుశేఖర భారతీ మహాస్వామి రాక



అన్నవరం: జగద్గురు ఆదిశంకరాచార్య స్థాపించిన దక్షిణామ్నాయ శృంగేరీ పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి గురువారం రత్నగిరి ఆలయానికి రానున్నట్టు దేవస్థానం అధికారులు బుధవారం తెలిపారు. విజయయాత్రలో భాగంగా సాయంత్రం 5 గంటలకు రత్నగిరిపై దర్శిస్తారన్నారు. అనంతరం స్వామీజీ భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తారని వివరించారు.

సనాతన ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకే...

గండేపల్లి: సనాతన ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు శృంగేరి జగద్గురు విధుశేఖర భారతి మహాస్వామి విజయ యాత్రలు నిర్వహిస్తున్నట్టు తత్వం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పాశర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ తెలిపారు. మండలంలోని పి.నాయకంపల్లిలో తత్వం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన సువర్ణ భారతి గోశాల, పాకశాల, ప్రవచన మంటపాలను విధిశేఖర భారతి స్వామి గురువారం ప్రారంభించనున్నట్టు చెప్పారు. పి.నాయకంపల్లిలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ధర్మాచరణను పెంపొందుచుట కోసం విధు శేఖర భారతీ స్వామి కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారని తెలిపారు. ప్రాంతీయ విభేదాలతో సంబంధం లేకుండా అకింతభావంతో అందరూ సనాతన ధర్మాన్ని ఆచరించాలన్నారు. దేశ ప్రజలందరూ ఏకమై గో సంపద సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉత్తరాయణ పుణ్య కాలంలో నిర్మించనున్న శివ పంచాయతన క్షేత్రానికి, అగ్రిహోత్ర ఆలయాలకు స్వామి ఆశీర్వాదాలతో మరింత విశిష్టత వస్తుందన్నారు. ఈ క్షేత్రంలో నిర్మించే అగ్రిహోత్రుని ఆలయం దేశంలోనే ప్రత్యేకత సంతరించుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన గోశాల, పాకశాల, ప్రవచన మంటపాల పర్యవేక్షకులు రవి కుమార్, సతీష్, ప్రవీణ్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు మలిరెడ్డి పాపారావు, వెంకట్రావు, పోలిన ఆంజనేయులు, కాకర్ల రామకృష్ణ, ఉప సర్పంచ్ బూరుగుపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: శృంగేరి పీఠాధిపతులు జగద్గురు విధుశేఖర భారతీ స్వామి మండలంలోని ఇర్రిపాక గ్రామానికి గురువారం మధ్యాహ్నం రానున్నారు. ఇర్రిపాకలో జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ఇటీవల ప్రతిష్ఠించిన ద్వాదశ జ్యోతిర్లింగాలను, భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయాలను ఆయన సందర్శించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలి

- రైతులకు వ్యవసాయాధికారుల సూచన
- గ్రామాల్లో పంట పొలాల పరిశీలన



ముక్కొల్లులో రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ



లింగంపర్తిలో రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారి జ్యోతి

ఏలేశ్వరం: తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి సూచించారు. మండలంలోని లింగంపర్తి, భద్రవరం, పేరవరం గ్రామాల్లోని వరి పొలాలు, కళ్లాలను బుధవారం ఆమె పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కోత కోసిన వరిపనలను కుప్పలుగా వేయాలన్నారు. ఆరబెట్టిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులు వరికోతలను వాయిదా వేసుకోవాలన్నారు. వర్షాలకు నీరు బయటకు పోయేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోతలు వాయిదా వేసుకోవాలి

ప్రత్తిపాడు: వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల వల్ల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని జగ్గంపేట వ్యవసాయశాఖ ఏడీఏ యింటి వీర గంగాధర్ సూచించారు. ప్రత్తిపాడు తహసీల్దార్ ఎం.సూర్యప్రభతో కలిసి ఆయన బుధవారం మండలంలోని ప్రత్తిపాడు, లంపకలోవ, పెదశంకర్లపూడి గ్రామాల్లో ఖరీఫ్ పంట పొలాలను సందర్శించారు. రైతులకు పలు సూచనలిచ్చారు. కోసి పనలపై ఉన్న పంట, కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యం రాశులను పరిశీలించారు. పంటలను త్వరగా ఒబ్బిడి చేసుకోవాలని సూచించారు.

పంట పొలాల పరిశీలన

ప్రత్తిపాడు రూరల్: తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వై.గంగాధర్ సూచించారు. మండలంలోని పెద శంకర్లపూడి, ధర్మవరం, పెద్దిపాలెం తదితర గ్రామాల్లో వ్యవసాయ సిబ్బందితో కలిసి బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను కారణంగా గురు, శుక్రవారాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రైతులు వరి కోతలు కోయవద్దన్నారు. కోత కోసి పనల మీద ఉన్న పంటను కుప్పలుగా వేసుకోవాలన్నారు. నూర్చిన ధాన్యాన్ని ఎత్తయిన ప్రదేశాలకు తరలించి భద్రపరచుకోవాలని సూచించారు.

పంటలను త్వరగా ఒబ్బిడి చేసుకోవాలి

కిర్లంపూడి: తుపాన్ ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు పంటలను త్వరగా ఒబ్బిడి చేసుకోవాలని ఏఓ జోకా అమృత సూచించారు. మండలంలోని కళ్లాల్లో, పొలాల్లో పనలపై ఉన్న వరి పంటను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనలపై ఉన్న వరి పంట, కల్లాల్లో ఎండబెట్టిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు చేర్చాలన్నారు. వాతావరణంలో సానుకూల మార్పు వచ్చిన తరువాతే వరి కోతలు కోయాలని రైతులకు సూచించారు.

ఆకట్టుకున్న వేషధారణలు



ప్రత్తిపాడులో ఆకట్టుకున్న బళ్ల వేషాలు

ప్రత్తిపాడు: స్థానిక మునసబు గారి రామాలయం వద్ద గౌరీదేవి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం నిర్వహించిన బళ్ల వేషాలు, దేవతామూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. చిన్నారుల నుంచి ముదుసలి వరకూ ఔత్సాహికులంతా ఈ వేడుకలో పాల్గొన్నారు. సుమారు 50 మంది శ్రీరామ పట్టాభిషేకం, పంచ పాండవులు, లవకుశలు, శివపార్వతులు, బాలభారతం వంటి సామూహిక ఘట్టాలే కాకుండా వినాయకుడు, కనకదుర్గమ్మ, షిర్డీ సాయి, ఉగ్ర నరసింహస్వామి, కుమారస్వామి తదితరుల దేవతామూర్తుల వేషధారణలో ప్రత్తిపాడు ప్రజలను ఆకట్టుకున్నారు. వీరంతా ట్రాక్టర్లపై ఆశీనులై గ్రామంలోని మెయిన్ రోడ్డుతో పాటు ప్రధాన వీధుల గుండా ప్రదర్శన నిర్వహించారు. వీరికి గొందేసి సత్యానందం బృందం మేకప్, డ్రెస్సింగ్ చేసింది. గతంలో వివిధ వేషధారణలతో రెండెడ్ల బండ్లపై ఊరేగేవారు. ప్రస్తుతం ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. వేషధారణలను తిలకించేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- ప్రత్తిపాడు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి కాటం భాను
- బాల్య వివాహాల నివారణపై విద్యార్థులకు అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి కాటం భాను

ప్రత్తిపాడు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి కాటం భాను తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల ముక్త భారత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి కాటం భాను మాట్లాడుతూ విద్యార్థులు ఒకస్థాయికి చేరుకునే వరకు చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే వెంటనే 100 నంబరుకు కాల్ చేసి, సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాల వల్ల ఉత్పన్నమయ్యే అనర్థాలను జడ్జి కాటం భాను వివరించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, ఐలాజ్ రాష్ట్ర హడ్‌హాక్ కమిటీ కన్వీనర్ బుగత శివ, బార్ కార్యదర్శి బొంగుకూరు మధుబాబు, అవసరాల దేవి, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ

ప్రత్తిపాడు: బాల్య వివాహ రహిత సమాజం కోసం మండల స్థాయి అధికారులు ప్రతిన బూనారు. ప్రత్తిపాడు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర మహిళా సంక్షేమ శాఖామంత్రి అన్నపూర్ణాదేవి ప్రసంగాన్ని తెర మీద వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడంలో అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆర్‌వీఎస్ లక్ష్మి మాట్లాడుతూ డిసెంబర్ 23వ తేదీ వరకు గ్రామాల్లో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ కుమార్ బాబు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వేశ్వరరావు, ఏపీఎం వై.వెంకట్, ఏపీఓ కుమారస్వామి, ఎంఈఓ వి.రాజబాబు, పీఆర్ జేఈ ఎం. సత్యప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్బలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వర్కర్లు, సీఆర్పీలు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్‌కు సత్కారం



రామచంద్రమోహన్ దంపతులను సత్కరిస్తున్న దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, సిబ్బంది

అన్నవరం: అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి ఈఓ బాధ్యతల నుంచి వైదొలగి దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్‌గా వెళుతున్న కె. రామచంద్రమోహన్‌ను దేవస్థానం సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించారు. సత్కార సభకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామచంద్రమోహన్ మాట్లాడుతూ తాను అడిషనల్ కమిషనర్, ఈఓగా రెండు బాధ్యతలు నిర్వహించలేకపోతున్నానని, అన్నవరం దేవస్థానం ఈఓ బాధ్యతలు తొలగించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఈ మేరకు కార్తిక మాసంలో భక్తుల రద్దీ తగ్గిన వెంటనే ఆ బాధ్యతలు తనను తప్పించారన్నారు. ముందస్తు ప్రణాళిక, సిబ్బంది పోలీసుల సహకారంతోనే గిరిప్రదక్షిణ, తెప్పోత్సవం, పర్వదినాల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా సేవలు అందించామన్నారు. నూతన ఇన్‌చార్జి ఈఓగా బాధ్యతలు స్వీకరించిన వి.త్రినాథరావు మాట్లాడుతూ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ తీసుకున్న నిర్ణయాలను కొనసాగిస్తే దేవస్థానంలో అన్ని పనులు చక్కగా జరిగిపోతాయని తెలిపారు. దేవస్థానం డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్, లోవ దేవస్థానం ఈఓ విశ్వనాథరాజు, దేవస్థానం ఈఈ రామకృష్ణ, అన్నవరం సర్పంచ్ కుమార్‌రాజా తదితరులు ప్రసంగించారు. కార్తిక మాసంలో అందించిన సేవలకు గాను ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు, అన్నవరం ఎస్ఐ శ్రీహరి బాబులను రామచంద్రమోహన్ ఘనంగా సత్కరించారు. అనంతరం రామచంద్రమోహన్ దంపతులను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ ఘనంగా సత్కరించారు. అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహనరావు, ఈఈ నూకరత్నం, వ్రతపురోహిత సంఘం మాజీ అధ్యక్షుడు నాగాబట్ల రవిశర్మ, ఫార్మసీ సూపర్‌వైజర్ వి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలసిన వైఎస్సార్ సీపీ నేతలు



తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన రౌతులపూడి మండలం నాయకులు

రౌతులపూడి: మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం రౌతులపూడి మండలానికి చెందిన ఆ పార్టీ నేతలు కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్యనేత వాసిరెడ్డి జమీలుతో పాటు పలువురు నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రధాన సమస్యలను మాజీ సీఎం జగన్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రౌతులపూడి జెడ్పీటీసీ గొల్లు చిన దివాణం, గౌతు నాగు, శంఖవరం పార్టీ మండల కన్వీనర్ నారాల శ్రీను, వాసిరెడ్డి భాస్కర్‌బాబు, కేదారిశెట్టి నాగేశ్వరరావు, ఎస్.మధు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తిక దీపోత్సవం



కొండయ్యపేటలో ఆకట్టుకున్న దీపాలంకరణ

కిర్లంపూడి: జగపతినగరం కొండయ్యపేట రామాలయం వద్ద మంగళవారం రాత్రి కార్తిక దీపోత్సవం కన్నులపండువగా జరిగింది. తొలుత కొండయ్యపేటకు చెందిన పలువురు దంపతులతో అర్చకులు శాస్త్రోక్తంగా పూజల నిర్వహించారు. అనంతరం శివలింగం ఆకృతిలో ఏర్పాటు చేసిన దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. దీపోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. దీపాలు వెలిగించేందుకు భక్తులు పోటీ పడ్డారు.

పరాక్ రాష్ట్రీయ సర్వేక్షణ్‌పై శిక్షణ

తుని: స్థానిక బ్యాంకు కాలనీ మున్సిపల్ హైస్కూల్ పరాక్ రాష్ట్రీయ సర్వేక్షణ్‌పై బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. డిసెంబర్ 4న జరిగే ఈ పరీక్షపై ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని డీఈఓ పి.రమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ రమేష్ మాట్లాడుతూ పరీక్ష నిర్వహణపై ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు దిశానిర్దేశం చేశారు. అనంతరం బాల్యవివాహాల నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మున్సిపల్ హైస్కూల్లో 9, 10 తరగతులను సందర్శించి విద్యార్థులకు పలు ప్రశ్నలు సంధించారు. విద్యార్థులు సంతృప్తిగా సమాధానాలు చెప్పకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాబోధనలో మెళకువలు పాటించాలని ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ గీతాదేవి పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

శంఖవరం: గ్రామంలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. తొలుత ఆలయ పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యండమూరి వీర వెంకటరమణ, రామలక్ష్మి, యండమూరి వీరబాబు, వీరవేణి దంపతుల చేతుల మీదుగా కల్యాణ మహోత్సవం జరిపించారు. భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో పర్వత సురేష్, చింతమనీడి కుమార్, పర్వత కృష్ణ, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు యండమూరి అప్పారావు, అద్దాల రమణ, శ్రీను, నూకరాజు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన

గోకవరం: మానవ అక్రమ రవాణా నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలని ప్రజ్వల కో ఆర్డినేటర్ శ్రావ్యశ్రుతి పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, రాజమహేంద్రవరం జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా మానవ అక్రమ రవాణా నిర్మూలనపై ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావ్యశ్రుతి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ, ఎంతో మంది జీవితాలను నాశనం చేస్తున్న నేర పూరితమైన చర్య అన్నారు. పేద, మధ్య తరగతి అమ్మాయిలు, మహిళలను ఉద్యోగం, ప్రేమ పెళ్లి పేరుతో మోసం చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారన్నారు. దీనిపై యుక్త వయసు బాలికలు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ కోఆర్డినేటర్ సురేష్‌కుమార్, సిబ్బంది అనిల్‌కుమార్, సుప్రియ, చెన్నా కేశవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.